APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ మంగళవారం 11 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :76 పేజీలు : 04 వెల: 2-00/-



## యూపీఐపై ఛార్జీలు లేవు

- నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- వినియోగదారులకు పన్ను ఉండదు
- ఎండీఆర్‌పై ఇంకా నిర్ణయం లేదు
- రోజువారీ కొనుగోళ్లకు ఊరట

న్యూఢిల్లీ, ఆగస్టు 10 : యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా చేసే లావాదేవీలపై వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల సవరణ బిల్లు--2026కు పార్లమెంట్ ఆమోదం లభించిన సందర్భంగా సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. యూపీఐ వినియోగంపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు మంత్రి స్పష్టత ఇచ్చారు. లోక్‌సభలో గత వారం ఆమోదం పొందిన ఈ బిల్లును రాజ్యసభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ మార్పు ద్వారా యూపీఐ వినియోగదారులపై లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించే అవకాశం కల్పించలేదని స్పష్టం చేశారు.

యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించనున్నారంటూ వస్తున్న వార్తలపైనా ఆర్థిక మంత్రి వివరణ ఇచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం దీనికి సంబంధించిన అంశాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్టీరింగ్ కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఎండీఆర్ విధానాన్ని ఖరారు చేయలేదని స్పష్టం చేశారు. దీంతో యూపీఐ చెల్లింపులపై తక్షణమే కొత్త రుసుములు అమల్లోకి వస్తాయన్న ప్రచారానికి తెరపడింది.

## భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం : సీఎం



కైకలూరు, ఆగస్టు 10 : రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులు, భూ యజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో సోమవారం నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా రైతుకు ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను ముఖ్యమంత్రి అందజేసి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా ముందుకు తీసుకెళుతున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన భూములను సెక్షన్ 22-ఏ పరిధిలో చేర్చి ఇబ్బందులకు గురిచేసిన సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల నిర్వహణలో లోపాలు చోటుచేసుకున్నాయని చంద్రబాబు ఆరోపించారు. 2019 నుంచి 2024 మధ్య భూములు, ఆస్తులను డిజిటల్ విధానంలో సెక్షన్ 22-ఏ పరిధిలోకి చేర్చడం వల్ల అనేక వివాదాలు ఏర్పడ్డాయని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సమస్యలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులను క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్--2026' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులకు పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆస్తుల వివరాల్లో అక్రమ మార్పులకు అవకాశం లేకుండా బ్లాక్‌చెయిన్ సాంకేతికతతో పాటు క్యూఆర్ కోడ్ వంటి భద్రతా సదుపాయాలను పాస్‌బుక్కుల్లో పొందుపరిచినట్లు చెప్పారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించి, వారి ఈ-కేవైసీ పూర్తయిన అనంతరం గ్రామసభల ద్వారా పారదర్శకంగా పాస్‌బుక్కుల పంపిణీ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులను రైతులు, భూ యజమానులకు అందజేశామని చంద్రబాబు తెలిపారు. రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులను జారీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 41 వేల ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులు, పరిశ్రమలు, ఇతర ప్రజలకు ప్రయోజనం కలిగిందని వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే విషయంలో సొంత పార్టీకి చెందిన వారైనా ఉపేక్షించేది లేదని గుంటూరు ఘటనను ప్రస్తావిస్తూ హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేసిన చంద్రబాబు, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించారు. భూ రికార్డుల ప్రక్షాళన, రీసర్వే ప్రక్రియ ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## అమిత్ షాతో టీడీపీ ఎంపీల భేటీ



న్యూఢిల్లీ, ఆగస్టు 10 : తెలుగు దేశం పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి, ప్రాధాన్యత, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించిన అంశాలను కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అమరావతి ప్రాధాన్యత, అభివృద్ధి, భవిష్యత్ దృష్టికోణాన్ని వివరించే పుస్తకాన్ని ఎంపీలు అమిత్ షాకు అందజేశారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలను ఎంపీలు ఈ సందర్భంగా వివరించినట్లు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా రాష్ట్రంలో మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు మరింతగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం, సమన్వయం అవసరమని వివరించారు. అమరావతి ప్రాధాన్యతను తెలియజేసే పుస్తకాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సాదరంగా స్వీకరించారు. అందులో పొందుపరిచిన రాజధాని అభివృద్ధి దృష్టికోణాన్ని ఆయన అభినందించినట్లు ఎంపీలు తెలిపారు. ఆధునిక ప్రమాణాలతో అమరావతిని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంపై కూడా ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు వెల్లడించారు. అమరావతిలో కొనసాగుతున్న, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీలు కేంద్ర హోంమంత్రికి వివరాలు అందించినట్లు తెలిపారు. రాజధాని నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పన, రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఇతర కీలక ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. రాష్ట్ర రాజధాని అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీపై ఫిర్యాదు



తిరుపతి, ఆగస్టు 10 : వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిపై జనసేన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరులో డీఎస్సీ అభ్యర్థుల పేరుతో నిర్వహిస్తున్న దీక్షలో శ్రీవారి భక్తిగీతాన్ని అవహేళన చేశారంటూ తిరుపతి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్ ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జనసేన పార్టీ తెలిపింది. ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ, నెల్లూరులో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో శ్రీవారి నామాల పాటను పేరడీ చేసి ప్రదర్శించారని, దీనివల్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. భక్తి భావాలతో కూడిన గీతాలను రాజకీయ నిరసన కార్యక్రమాల్లో అవహేళన చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని కించపరిచేలా ఎవరైనా వ్యవహరిస్తే దానిపై సంబంధిత సంస్థలు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని జనసేన నాయకులు పేర్కొన్నారు. భక్తుల విశ్వాసాలకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పోలీసులను కోరారు. జనసేన నాయకులు మాట్లాడుతూ, డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కు అయినప్పటికీ, ఆందోళనల్లో ఇతరుల మత విశ్వాసాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సమర్థనీయం కాదని అన్నారు. అభ్యర్థుల సమస్యలను ప్రస్తావించే కార్యక్రమాల్లో వివాదాస్పద అంశాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## భక్తి గీతాల అపహాస్యంపై పవన్ ఆగ్రహం



అమరావతి, ఆగస్టు 10 : దైవ నామాలు, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి పవిత్ర నామాలను కించపరిచేలా వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇటువంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఘటనను పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా ఉపయోగించారని, ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని పేర్కొన్నారు. ధార్మిక విశ్వాసాలకు సంబంధించిన పవిత్ర నామాలను రాజకీయ కార్యక్రమాల్లో అపహాస్యంగా ఉపయోగించడం సముచితం కాదని అన్నారు. ఇలాంటి చర్యలు కేవలం అపహాస్యానికి పరిమితం కాకుండా మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు, నిరసనలు ఏవైనా ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఉండాలని సూచించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకనగా చూడటం లేదా వాటిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ వ్యవహరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను రాజకీయ వివాదాలకు ఉపయోగించవద్దని పవన్ కల్యాణ్ హితవు పలికారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ఏ వర్గానికి చెందిన వారైనా పవిత్రమైన ధార్మిక అంశాల విషయంలో సంయమనం పాటించాలని సూచించారు. భక్తికి సంబంధించిన విషయాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసాలను కాపాడే విషయంలో జనసేన పార్టీ స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతుందని పవన్ కల్యాణ్ తెలిపారు. ధార్మిక అంశాలపై వివాదాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

# వైసీపీ నిరాధార ఆరోపణలు మానుకోవాలి




**- కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు సరికాదు..**
**ఆధారాలుంటే అసెంబ్లీలో నిరూపించాలి**
**- వద్దే సిమెంట్ పోలన్న**

అనంతపురం, ఆగస్టు 10 అనంత సూర్య : కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్దే సిమెంట్ పోలన్న తీవ్రంగా ఖండించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన వైసీపీ ఉనికిని కాపాడుకునేందుకే ప్రభుత్వంపై ఏదో ఒక రకంగా బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ సందర్భంగా పోలన్న మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టిందని, అర్హత, ప్రతిభ ఆధారంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని తెలిపారు. ఈ నియామక ప్రక్రియను ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసి అభ్యర్థులకు నియమకాలు చేశారన్నారు. ఆధారాలు లేని ఆరోపణలతో రోడ్డుపై ధర్నాలు, నిరసనలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. నిజంగా మీ దగ్గర ఆధారాలుంటే బయట పెట్టండి.. అసెంబ్లీలో మాట్లాడండి.. విచారణ కోరండి. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ రాజకీయ డ్రామాలు చేయడం మానుకోండి" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనపై దృష్టి సారించిందని పోలన్న తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 16 వేలకుపైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసిందని పలు వార్తా నివేదికలు కూడా పేర్కొంటున్నాయి. "వైసీపీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి. ప్రజలను తప్పుదోవ పట్టించే నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారు. రాజకీయ విమర్శలకు మేము సిద్ధమే.. కానీ యువత భవిష్యత్తుతో ఆటలాడితే మాత్రం చూస్తూ ఊరుకోబోం" అని వద్దే సిమెంట్ పోలన్న స్పష్టం చేశారు.

# నేడు ఎస్టీ కమిషన్ సభ్యుల జిల్లా పర్యటన

చిత్తూరు, ఆగస్టు10(అనంత సూర్య): రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప మంగళవారం కుప్పం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేపట్టింది. రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప ఈ నెల 10వ తేదీన విజయవాడ నుంచి బయలుదేరి కుప్పం చేరుకుని రాత్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో బస చేశారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు కుప్పంలోని గంగమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అనంతరం కుప్పం పట్టణంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలోని గిరిజన ప్రజల నుంచి వారి సమస్యలు, ఇబ్బందులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులను నేరుగా స్వీకరించనున్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, విద్య, ఉపాధి, భూములు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలపై కమిషన్ తరఫున పరిశీలన చేయనున్నారు. గిరిజన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఆధారాలు, సంబంధిత పత్రాలతో కార్యక్రమానికి హాజరై వినతులను సమర్పించుకోవాలని అధికారులు సూచించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్యక్రమాలు ముగిసిన అనంతరం సాయంత్రం 4 గంటలకు కుప్పం నుంచి రోడ్డు మార్గంలో అనంతపురానికి బయలుదేరి వెళ్లనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు ఆర్థిక భరోసా

వెదురుకుప్పం, ఆగస్టు10(అనంత సూర్య): పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అనుకోని వైద్య ఖర్చులు, ప్రమాదాలు, కుటుంబ సభ్యుల మృతి వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ద్వారా సహాయం అందిస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

సోమవారం జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే వి. థామస్‌తో కలిసి పాల్గొని లబ్ధిదారులకు మంజూరు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు రూ.400 కోట్లను సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఖర్చు చేస్తోందన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అత్యవసర వైద్య చికిత్స, అనుకోని ప్రమాదాలు, కుటుంబ సభ్యుల మృతి వంటి సందర్భాల్లో అర్హులు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వాన్ని సంప్రదించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం పొందవచ్చని చెప్పారు. దరఖాస్తుల్లో ఏవైనా లోపాలు లేదా సందేహాలు ఉంటే వాటిని సరిచేసి అర్హులైన వారికి సకాలంలో సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో ప్రభుత్వ సహాయం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**జీడీ నెల్లూరు నియోజకవర్గానికి రూ.6.50 కోట్ల వరకు సాయం**

జీడీ నెల్లూరు ఎమ్మెల్యే వి. థామస్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్యంగా పేదలకు చేరాల్సిన ఆర్థిక సహాయమని, దీనికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు రూ.6 కోట్ల నుంచి రూ.6.50 కోట్ల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆరు మండలాలకు సంబంధించి సుమారు రూ.47 లక్షల విలువైన మంజూరు చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల శకుంతల అనే యువతిని పాము కాటువేయడంతో సిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, సుమారు రూ.8 లక్షల వరకు వైద్య బిల్లు అయినట్లు తెలిపారు. విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి, 24 గంటల్లోనే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.8 లక్షలను ఆసుపత్రికి జమ చేయించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తన పదవీకాలంలో ఇప్పటివరకు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 43 మందికి ఎల్‌వీసీ ద్వారా వైద్య ఖర్చులను పరిష్కరించినట్లు తెలిపారు.



**మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం**

నియోజకవర్గానికి చెందిన ఓ కుటుంబ సభ్యురాలు గంగానదిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చెక్కు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు**

నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించే అంశంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల భవనాల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. దేవళంపేటలో శిథిలావస్థకు చేరిన విలేజ్ క్లినిక్ భవన అభివృద్ధికి సుమారు రూ.36 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ భవనం అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు చిన్నచిన్న సమస్యలపై పరస్పరం గొడవలకు దిగకుండా, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు,

# ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలి



చిత్తూరు,ఆగస్టు 10(అనంత సూర్య): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో మొత్తం 43 ఫిర్యాదులను స్వీకరించినట్లు చిత్తూరు జిల్లా పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాషా, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్. షాను ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు ఎస్పీలకు నేరుగా వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విన్న అధికారులు, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితుల సమక్షంలోనే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన విచారణ నిర్వహించి, నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు పోలీసు శాఖ ద్వారా సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందిన 43 ఫిర్యాదుల్లో కుటుంబ తగాదాలకు సంబంధించి 5, వేధింపులకు 9, ఇంటి తగాదాలకు 4, భూ తగాదాలకు 9, డబ్బు తగాదాలకు 5, చిన్న తగాదాలకు 2, పోలీసు సేవలకు సంబంధించి 1, ఆస్తి తగాదాలకు 6, బెదిరింపులకు సంబంధించి 2 ఫిర్యాదులు ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చి, చట్టపరమైన పరిష్కారం పొందేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోలీసు అధికారులు సూచించారు.


# స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

చిత్తూరు,ఆగస్టు 10(అనంత సూర్య): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా హెచ్ఓడీలతో డీఆర్ఓ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలకు ప్రతి శాఖ నుంచి నిజంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగుల పేర్లనే ప్రతిపాదించాలని సూచించారు. గతంలో పురస్కారం పొందారనే కారణంతో వరుస క్రమంలో పేర్లు పంపడం సరికాదన్నారు. జనవరి నుంచి ఆగస్టు వరకు ఉద్యోగులు అందించిన విశిష్ట సేవలు, నాణ్యమైన పనితీరు, వినూత్న కార్యక్రమాల అమలు ఆధారంగా పురస్కారాలకు ఎంపిక చేయాలని తెలిపారు. ప్రతిపాదనలను మంగళవారం మధ్యాహ్నం 2 గంటల్లోపు జిల్లా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ శాఖలు తమ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని డీఆర్ఓ సూచించారు. ఇప్పటికే 12 స్టాళ్లు, నాలుగు అసెట్స్‌ను ఖరారు చేసినట్లు తెలిపారు. ఆయా శాఖలు సమన్వయంతో పనిచేసి నాణ్యమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. టెలికాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఇంటింటి సర్వే చేపట్టిన బండి శంకర, రాజు రాయల్

అనంతపురం, ఆగస్టు 10 అనంత సూర్య : రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు అనంతపురం ప్రాంతంలో ఇంటింటి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా బిజెపి కాలనీలో మాజీ సర్పంచ్ బండి శంకర, టిఎన్టియుసి హిందూపురం పార్లమెంట్ సెక్రెటరీ రాజు రాయల్ ఆధ్వర్యంలో ఇంటింటికి సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతపురం రూరల్ రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే సునీతమ్మ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని, కాలనీలోని ప్రజలందరూ ఇందుకు సహకరిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పేపర్ వెంకటేష్, రాము నాయక్, కావేరి నాయక్, టిడిపి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# శిక్ష పడి తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి అరెస్ట్



అనంతపురం ఆగస్టు 10 అనంత సూర్య న్యూస్ : ఆరు మోటార్ సైకిల్ దొంగతనాలు కేసుల్లో శిక్ష పడి గత మూడు సంవత్సరముల నుండి తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి సద్దాం హుస్సేన్ కు కోర్టు వారు నాన్ బైలబుల్ వారెంట్ జారీ చేసినారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అనంతపురం మూడవ పట్టణం పోలీస్ స్టేషన్ సిఐ శ్రీ కౌలుట్లయ్య వారి సిబ్బందినీ టీమ్ లుగా చేసి వారికి రాబడిని కచ్చితమైన సమాచారం మేరకు గుంటూరు నందు ఈ దినం ముద్దాయిను అరెస్టు చేసి, రాజశ్రీ స్పెషల్ మొబైల్ కోర్ట్ మ్యాజిస్ట్రేట్ గారి వద్ద హాజరు పరిచి రిమాండ్ కు తరలించడం అయినది.

# అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో – అడ్డుకున్న పోలీసులు

తపోవనం, ఆగస్టు 10: (అనంత సూర్య ): డీఎస్పీ ఆధ్వర్యంలో భారీగా పోలీసుల మోహరింపు -- కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకుల అరెస్టు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన శాసన ఉల్లంఘన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళనకారులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించి ఆందోళనకారులను చుట్టుముట్టారు. పోలీసులు అడ్డుకున్నప్పటికీ కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు వెనక్కి తగ్గకుండా నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ రాజారెడ్డి, రైతు సంఘం నాయకులు ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున, రైతు కూలీ సంఘం నాయకులు నాగరాజు తదితరులు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం దేశ చరిత్రలో ఒక ఘట్టం మాత్రమే కాదని, అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడేందుకు నిరంతరం స్ఫూర్తినిచ్చే మహత్తర ఉద్యమమని అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా ఆనాడు దేశ ప్రజలు




భయాన్ని వీడి వీరోచితంగా పోరాడారని, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమించారని గుర్తుచేశారు. అదే క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు దేశంలో ప్రజలపై భారాలు మోపుతున్న, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులను దెబ్బతీ-స్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజాస్వామ్య శక్తులు విస్తృతంగా ఐక్యమై ప్రజా హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి. గోపాల్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ సిఐటియు నగర నాయకులు ఎన్టీఆర్ శ్రీనివాసులు, శివ ప్రసాద్, ఆజం భాష, ఆది,మధు, వెంకట్ నారాయణ, చీమల ప్రకాష్ రెడ్డి, ఇర్ఫాన్, శంకర్, బంగారు నాగరాజు, ఆదినారాయణ, తిరుమలేష్, స్వాతి, ఎర్రిస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి, చెన్నప్ప యాదవ్, ఐద్వా కార్యదర్శి అశ్వని, ఫరీదా, ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి, కృష్ణుడు, రాజు, రైతు కూలీ సంఘం నాయకులు నాగరాజు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమిస్తాం

- అవసరమైతే అసెంబ్లీ ముట్టడి చేస్తాం
- డీఎస్సీపై మండలిలో చర్చించడానికి ధైర్యం లేదా?
- డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరగాలి
- స్పోర్ట్స్ కోటాలో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- శాంతియుత ర్యాలీలను అడ్డుకోవడం దుర్మార్గం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు
- డీఎస్సీ అక్రమాలపై అనంతపురంలో కదంతొక్కిన శ్రేణులు




అనంతపురం, ఆగస్టు 10 అనంత సూర్య న్యూస్: డీఎస్సీ నియామకాలకు సంబంధించి స్పోర్ట్స్ కోటాలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారని, దీనిపై తక్షణం సీబీఐ విచారణ చేయించాలని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమాలు చేస్తామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. డీఎస్సీ--2025లో అక్రమాలపై సోమవారం అనంతపురంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు పార్టీ శ్రేణులు కదంతొక్కాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలను అవినీతిమయం చేశారన్నారు. పేపర్ లీకేజ్‌తో పాటు స్పోర్ట్స్ కోటాకు సంబంధించి కూడా జీవోలు మార్చారని తెలిపారు. స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. కావాల్సిన వాళ్లకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఇచ్చుకుని ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై తక్షణం సీబీఐ విచారణతో పాటు నైతిక బాధ్యతగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి సంబంధించి అసెంబ్లీలో చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలు చెబుతున్నారని.. శాసన మండలిలో చర్చించే ధైర్యం లేదా? అని అన్నారు. డీఎస్సీ అక్రమాలతో పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లతో ఇప్పటికే కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు కూడా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు చేపడుతుంటే విజయవాడ, పులివెందుల, గుంటూరు, కడప జిల్లాతో పాటు తాడిపత్రిలో నిరసనలు తెలియజేయడానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాడిపత్రికి వెళ్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో తన ఇంట్లో నుంచి బయటకు రాకుండా చేశారన్నారు. ఈ ప్రభుత్వానికి కాలం దగ్గరపడిందని హెచ్చరించారు. డీఎస్సీలో కోచింగ్ సెంటర్లు పెట్టుకున్న వాళ్లకు, పరీక్ష ప్రక్రియలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న వ్యక్తికి ఫస్ట్ ర్యాంకులు వచ్చాయన్నారు. తక్షణం స్పోర్ట్స్ కోటాకు సంబంధించి వివరాలన్నీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగుల ఆశలను చంద్రబాబు ప్రభుత్వం చిదిమేసిందని తెలిపారు. విద్యార్థి, యువత, నిరుద్యోగులు, డీఎస్సీలో అన్యాయానికి గురైన వారి తరఫున పోరాడుతుంటే రెడ్‌బుక్ రాజ్యాంగంతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎ-స్సీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. యువత రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదని, భవిష్యత్‌లో ఉద్యమాలు తీవ్రంగా ఉంటామని హెచ్చరించారు. డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థులతో పాటు యువత, విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులను రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ అంటూ అధికార పార్టీ నేతలు అవహేళగా మాట్లాడుతున్నారని, భవిష్యత్‌లో యువత సత్తా ఏమిటో తెలియజేస్తామన్నారు.




# బోనాలకు వేళాయె

## సీసీ హరి ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవికి బోనాల పండుగ

పెనుకొండ, ఆగస్టు 10:( అనంత సూర్య) ఆషాడశుద్ధ అమావాస్య పర్వదినాన ఈనెల 12న చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సి సి హరి తెలిపారు. తెలంగాణలో ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో, కనీవిని ఎరగని రీతిలో సోమందేపల్లి లోని పురాతన దేవాలయం, పాత ఊర్లో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలను పెద్ద ఎత్తున బోనాలతో నిర్వహిస్తామని తెలిపారు. ప్రపంచ మానవాళి సుభిక్షంగా ఉండాలని, కుల మతాలకతీతంగా, రాగద్వేషాలకు అతీతంగా, నాడు జరిగే కార్యక్రమానికి అన్ని వర్గాల వారు అన్ని కులాల వారు హాజరై అమ్మవారి కరుణ కటాక్షాలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో పలుచోట్ల మహిళలకు ముఖ్యంగా యువతులకు చిన్నారులకు, బోనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని, మనసా వాచా అందరూ తప్పకుండా పాల్గొనాలని తొగట వీర క్షత్రియ సంఘం తరపున కోరుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జోలి శాఖ మాత్యులు సవితమ్మ పాల్గొని పూజలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తుల కొంగుబంగారం చౌడేశ్వరి దేవి, శతాబ్దాలుగా గ్రామ దేవతగా వెలుగు గ్రామాన్ని కాపాడుతున్నారని, ప్రతి ఒక్కరూ ఆమె అనుగ్రహ పాత్రులు కావాలని కోరారు. ఈ సందర్భంలో గ్రామంలోని వాడవాడలో చౌడేశ్వరి దేవిజయంతి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




# పి జి ఆర్ ఎస్ పిటీషన్లకు చట్టబద్ధమైన పరిష్కారం చూపండి

## - జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఐపీస్

అనంత క్రైమ్, ఆగస్టు 10:( అనంత సూర్య): పిటీషనర్లు, వెంట వచ్చిన ప్రజలకు ఇస్కాన్ సహకారంతో ఉచిత భోజనం ౹ా+=ా పిటీషన్లకు జాప్యం లేకుండా చట్టబద్ధమైన పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీస్ ఆదేశించారు. సోమవారం... జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (౹ా+=ా) కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి స్వయంగా 106 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... బాధితుల నుంచి వచ్చిన ప్రతి పిటిషన్‌నూ బాధ్యతాయుతంగా విచారించాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి, నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేయాలన్నారు. పిటీషనర్లకు సమాచారంలి : ఫిర్యాదుపై విచారణ పూర్తయిన తర్వాత సంబంధిత పిటిషనర్‌కు తప్పనిసరిగా సమాచారం అందించి, వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలి. చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారంలి : సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపించేలా అధికారులు దృష్టి సారించాలి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పోలీస్ సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. కాగా, ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులకు దరఖాస్తుల నమోదులో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించారు. లిజిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం పిటీషనర్ల నుండీ పిటీషన్లు స్వీకరించారు.



# అనంతపురం నగరంలో అనేక సమస్యలపై కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన

## - డాక్టర్ పోతుల నాగరాజు



అంత కలెక్టరేట్, ఆగస్టు 10:( అనంత సూర్య) అనంతపురం నగర కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను మీ దృష్టికి తెస్తున్నాము. వీటిని మీరు పరిశీలించి పరిష్కారం చేయాలని కోరుకుంటున్నాము. నగరంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వీటి పరిష్కారం కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి పని చేయాలని, ప్రజల నుంచి కోట్ల రూపాయలు పన్నులు వసూలు చేస్తున్నారు, కానీ ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించక పోతే, ఎవరికి చెప్పు కోవాలి. ట్రాఫిక్ సమస్య తో ప్రతి రోజు ప్రజలు రోడ్ల మీద ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల మీద చెత్త, పారిశుద్ద సమస్య వలన అనేక రోగాలకు ప్రజలు బలి అవుచున్నారు. రోడ్ల పక్కన పుట్ పాత్ ల ఆక్రమణలు వలన విద్యార్థులు, మహిళ లు, వృద్ధులు అనేక ఇబ్బంది పడుతున్నారు. ప్రయివేట్, ,కార్పొరేట్ విద్యా సంస్థ ల యాజమాన్యం వసూలు చేస్తున్న అక్రమ ఫీజు ల వలన ప్రజలు ఆర్థికంగా చిదిగి పోతున్నారు. ప్రయివేట్ క్లీనిక్ లలోను, ఆసుపత్రుల లోను రోగుల నుంచి వసూల్ చేస్తున్న టోకెన్ ఫీజులను 100 రూపాయలు వసూలు చేసే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని ప్రజలకు మేలు చేయండి. ఫ్లెక్సీ ల వలన జరుగుతున్న ఇబ్బంది, తాగే నీరు అక్రమ వ్యాపారం, పాలు కల్తీ, రోడ్డు పక్కన ఆహారం , బస్టాండ్, రైల్వే స్టేషన్ లలో వ్యాపారుల, ఆటో వాళ్ళు పెడుతున్న ఇబ్బంది, ఫిష్, మటన్, చికెన్ వ్యాపారం రోడ్ల మీద చేస్తా వాటి లో దుమ్ము ధూళి అవుతున్న కలుషితం వల్ల ప్రజలకు రోగాలు, ఇలా ప్రతి చోట ప్రజలు ఏ విదంగా ఇబ్బంది పడుతుంది చెప్పడానికి కూడా వీలు కాదు. వీటి పైన అధికారు లను ఆ శాఖ లకు సంబందించిన సిబ్బంది చర్యలు తీసుకొనే విదంగా ఆదేశాలు ఇవ్వాలని, ఈ సమస్య లు పరిష్కారం చేసి ప్రజలకు మెరుగైన జీవితంను, ఆరోగ్యం ను మీ ద్వారా ఇవ్వాలని , మీకు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు విన్నపం చేస్తున్నారు. మా విన్నపంను మన్నించి సమస్యల పరిష్కారం చేస్తారని....కోరుకుంటున్నాము, ఈ కార్యక్రమంలో ౹ాూ జిల్లా అధ్యక్షులు హరి కురుబ, యువత అధ్యక్షులు హేమంత్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కిష్ణ, ౹ాూ సోషల్ మీడియా ఇంచార్జ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు

**- రెండున్నరేళ్లలోనే అనంత అభివృద్ధికి కొత్త దిశ**

**టీఎన్‌టీయసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు**



అనంతపురం, ఆగస్టు 10 అనంత సూర్య : అనంతపురం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను టీఎన్‌టీయసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంచపు వడ్డే వెంకటేశులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నాయకత్వంలో అనంతపురం నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టి, డంపింగ్‌ను దాదాపు 70 శాతం వరకు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గతంలో 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని కొందరు గొప్పలు చెప్పుకోవడం కాదని, కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే అనంతపురం అభివృద్ధి అంటే ఇదేనని చేసి చూపిస్తున్న ఘనత ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో రెండో డివిజన్ మాజీ కార్పొరేటర్ గుర్రం నాగభూషణం, ఆరవ డివిజన్ యూనిట్ ఇంచార్జ్ ఆర్.కె. రామకృష్ణ, రూపులగుడి రవికుమార్, పదో డివిజన్ యూనిట్ ఇంచార్జ్, బూత్ సభ్యులు పద్మక్క, గౌరమ్మతో పాటు టిడిపి నాయకులు బాష, సుబ్బరాయుడు, బ్రహ్మయ్య, ఫాతిమా, నరేష్ చౌదరి, గౌస్ పీరా, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాల్సిందే...

## అనంతపురంలో వెటరన్ జర్నలిస్టుల ధర్నా



అనంతపురం , ఆగస్టు 10: అనంత సూర్య న్యూస్ : దేశంలోని 19 రాష్ట్రాల్లో అమలవుతున్న తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ సీనియర్ జర్నలిస్టులకు తక్షణమే గౌరవప్రదమైన పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వెటరన్ జర్నలిస్టులు ఆందోళన బాట పట్టారు. జిల్లా వెటరన్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం నగరంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో జీవితాలను అంకితం చేసి, ప్రజలకు నిరంతరం సమాచారాన్ని అందించిన సీనియర్ పాత్రికేయుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. వయసు మీద పడిన జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

19 రాష్ట్రాల్లో అమలు.. ఏపీలో ఎందుకు ఆలస్యం?

దేశంలోని 19 రాష్ట్రాల్లో ఇప్పటికే సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాలు అమలవుతున్నాయని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ వెంటనే పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి, వృద్ధాప్యంలో వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

వినతులు ఇచ్చినా స్పందన కరువు

సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సమాచార శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని నాయకులు తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందన్నారు.

డిమాండ్‌పై సానుకూల నిర్ణయం తీసుకోవాలి

వృద్ధాప్యంలో ఉన్న పాత్రికేయులకు పెన్షన్ పథకం ఎంతో అవసరమని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్‌ను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నాలో వెటరన్ జర్నలిస్టులు, సీనియర్ పాత్రికేయులు, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకొండయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# SR లో జగన్నాటకం

## శివ.. శివ..



- విద్యార్థులతో హెచ్చుమీరిన పైసా ఆనందం
- వక్ర సంపాదనతో రూ.కోట్లు ఘటిస్తున్న ఉన్నత సిబ్బంది
- అన్నీ గమనిస్తూ.. మౌనంగా వరంగల్లు వరదారెడ్డి
- పైసామే పరమావధిగా కళాశాల ఇమేజ్ డ్యామేజ్ !
- పైపై ఫీజులు కట్టలేక తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- షరా మామూళ్లు.. అన్నట్లుగా ఆర్ఐఓ వ్యవహారం





*అనంతపురం, ఆగస్టు10 అనంతసూర్య :*

నేరం చేసిన వారి కంటే నేరాన్ని ప్రోత్సహించిన వారికే పెద్ద శిక్ష అని చట్టాలు చెబుతాయి. అన్ని తెలుసుకుంటూ.. ఆ వక్ర పనులను పైవారికి తెలియకుండా దాచడం కూడా నేరమే. అదే చేస్తున్నాడట ఎస్సార్ జూనియర్ కళాశాలలోని జగన్నాటక సూత్ర ధారి.. పాత్రధారిగా మారిన శివ శివా.. చేస్తున్న స్వామి ద్రోహం అంతా ఇంతా కాదు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నియమ నిబంధనలు పాటించకుండా పాకెట్ మనీ పేరుతో విద్యార్థుల నుండి దోచుకుంటున్న ఉదంతం అత్యంత దారుణం. దాదాపు అనంతపురం ఎస్ఆర్ కళాశాలలకు సంబంధించి 2 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరి నుండి పాకెట్ మనీ 4 వేల రూపాయలు చొప్పున దాదాపు రూ.80 లక్షలు టీ, సమోసా, బిస్కెట్స్ పేరుతో, కళాశాల స్టోర్, బేకరీని ఆధీనంలో ఉంచుకొని తప్పుడు లెక్కలు చూపుతూ.. ప్రతి సంవత్సరం దోచుకుంటూ అనధికాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తాడని తెలిసింది. ఆ ఎస్ఆర్ కళాశాల యాజమాన్యంకు తెలియకుండా చేస్తున్న మోసాలు కూడా కోకొల్లలే. ఇతనిని చూసుకొని మరొక బ్రాంచ్‌కి చెందిన కళాశాల ప్రిన్సిపల్ కూడా తానేమి తీసిపోలేదు అన్నట్లుగా.. కళాశాలలో వేడి నీళ్ల వ్యాపారం మొదలు, ప్రతిదీ వ్యాపారంగా మార్చేసుకుని ఉపాధి కల్పించిన సంస్థకే వెన్నుపోటు పొడుస్తుందని తెలిసింది. అత్యంత విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం మేరకు.. ఆ కళాశాల పేరు ప్రతిష్టలను చూసి స్వచ్ఛందంగా 400 మంది విద్యార్థులు కళాశాలలోకి చేరితే, వారందరినీ తానే చేర్పించాను అన్నట్లుగా.. ఆ విద్యా సంస్థ వ్యవస్థాపకునికే టోకరా పెట్టి ఒక్కొక్క విద్యార్థిపై రూ.3 వేల రూపాయలు చొప్పున యాజమాన్యం నుండి వసూలు చేసిందంటే.. ఈమె ఎంతటి ఘానపాటో అర్థం చేసుకోండి. ఇలా అక్రమంగా సంపాదించిన లెక్కతో.. ఆ సొమ్మును నెలవారి వడ్డీలకు తిప్పుతూ వడ్డీ వ్యాపారం కూడా చేస్తుందట. పవిత్రమైన ఆ కళాశాలకు అపవిత్రమైన పేరును అంటగట్టేందుకు ఆ ఇద్దరు వ్యవహరిస్తున్న తీరుపైన, అన్నీ తెలిసి చోద్యం చూస్తున్న చర్యలు తీసుకోకుండా ఆర్ఐఓపైన అటు విద్యార్థి సంఘాలు ఆందోళన బాట పడుతుంటే.. ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు పైపై ఫీజులు కట్టలేక ఆందోళన చెందుతున్నారని తెలిసింది. మరొక విశ్లేషణాత్మక కథనంలో కళాశాలను అడ్డంపెట్టి ఆ శివ సంపాదించిన ఆస్తులు ? అదే బ్రాంచ్‌కి చెందిన ఓ ప్రిన్సిపాల్ విద్యార్థుల నుండి అక్రమ ఫీజులతో సంపాదించిన డబ్బుతో చేస్తున్న వడ్డీ వ్యాపారం తదితర అన్ని విషయాలను **'అనంత సూర్య'** వివరిస్తుంది.



బిల్డింగ్ వెనుక వైపు పనులు జరుగుతున్న దృశ్యం

# 102 జీవోతో బడుగు విద్యార్థులు నష్టపోతారు


అనంతపురం, ఆగస్టు 10 అనంత సూర్య : ఎంబీబీఎస్, బీడియస్ అడ్మిషన్ల విషయంలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వ్యతిరేకంగా ఇచ్చిన జీఓ నెంబర్ 102ను రద్దు, చేసి 151ని పునరుద్ధరణ చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ నేతలు సోమవారం జేసీ విష్ణు చరణ్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ 102 జీవో ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లలు మెడికల్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అన్ని సీట్లకూ కలిపి ఒకేసారి ఆప్షన్ ఇచ్చే విధానాన్ని రద్దు చేసి, ప్రతి విడత కౌన్సెలింగ్‌కు ముందు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు వీలు కల్పిస్తూ.. ఈ ఏడాది జూలై 30న జారీ చేసిన జీవో 102ను హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం చేసి ఇచ్చిన నివేదిక ఆధారంగా కౌన్సెలింగ్ విషయంలో 2020లో ప్రభుత్వం జీవో 151 తీసుకొచ్చిందన్నారు. దీని ప్రకారం విద్యార్థులు ఒక్కసారి మాత్రమే వెబ్ ఆప్షన్ ఎంచుకునే అవకాశం ఉండేదన్నారు. తాజా జీవో 102తో ప్రతి విడత కౌన్సెలింగ్‌కు ముందు వెబ్ ఆప్షన్ పెట్టుకొనేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. ఈ జీవో తీసుకొచ్చే ముందు నిపుణులతో ఎలాంటి అధ్యయనం జరగలేదన్నారు. దీంతో రిజర్వ్ కేటగిరీ విద్యార్థులు ఓపెన్ క్యాటగిరీ సీట్లు పొందే అవకాశాలు కోల్పోతారన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ తరపు న్యాయవాది టీవీ శ్రీదేవి వాదనలు వినిపిస్తూ.. ఒక్కసారి మాత్రమే వెబ్ ఆప్షన్ ఎంచుకునే అవకాశం ఇవ్వడం వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు సీట్లను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన జీవో 102ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మెడిసిన్ విద్యార్థులు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమం చేసి విద్యార్థులకు న్యాయం జరిగే దాకా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, జిల్లా నేతలు గోవింద్ నాయక్,శ్రీశాంత్, రాజేష్, విజయ్, సాయి రెడ్డిలు పాల్గొన్నారు.



# ఆర్ ఐ ఓ నాయక్ అవినీతిపై ఎన్టిఎఫ్ ఫిర్యాదు – పీజీఆర్ఎస్ లో స్పందించిన డిఆర్ఓ

అనంతపురం, ఆగస్టు 10 అనంత సూర్య న్యూస్: అనంతపురం జిల్లాలో అనధికారిక జూనియర్ కళాశాలలను, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్న వాటిని ప్రోత్సహిస్తూ అత్యంత అవినీతికి పాల్పడుతున్న ఆర్ఐఓపై చర్యలు తీసుకోవాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్ కుమార్ తెలియజేశారు. సోమవారం కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్ ఐ ఓ తీరును తప్పుపడుతూ విద్యా వ్యవస్థకు చేస్తున్న నష్టాన్ని స్పష్టమైన ఆధారాలతో అక్కడి ఉన్నతాధికారులకు వివరించారు. జిల్లాలో అనధికారిక జూనియర్ కళాశాలలను ప్రోత్సహించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్న కళాశాల వద్ద కాసులతో కమిట్మెంట్ పనులు చేపడుతున్నారని ఘాటుగా విమర్శించారు. డబ్బే పరమావధిగా పలు జూనియర్ కళాశాలలు అధిక ఫీజులు పైపై ఫీజుల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నారని , అన్ని తెలిసినా విద్యార్థి నేతలు ఒకవైపు ఆందోళన చేస్తున్న తమకేమీ పట్టనట్లుగా నెలవారీగా వస్తే చాలు అన్నట్లుగా ఆర్ ఐ ఓ తీరు తయారైందని, ఆర్ ఐ ఓ పలు జూనియర్ కళాశాలతో చేసుకున్న ఒప్పందం కారణంగానే యదేచ్ఛగా నిబంధనలు అధిక్రమించి కొన్ని కళాశాలలు, మరి కొన్ని ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహణ చేపడుతున్నాయని స్పష్టంగా తెలియజేశారు. అందుకు స్పందించిన జిల్లా రెవెన్యూ అధికారి మలోల,ఆ ఆర్ ఐ ఓ పై విచారించి చర్యలు తీసుకోవాలని ఆర్ జె డి కి సూచించారు. గుజ్జల లక్ష్మణ్ ఫిర్యాదుతో విద్యాశాఖలోని ఆర్ ఐ ఓ కి ఒకరకంగా గొంతులో గులక్కాయపడినట్లుగా మారిందని విద్యాశాఖలోని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్జెడి స్థాయి అధికారి నిష్పక్షపాతంగా విచారణ జరిగితే ఆర్ ఐ ఓ అవినీతి స్పష్టంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని, తద్వారా చర్యలు కూడా తీసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పిజిఆర్ఎస్లో ఫిర్యాదు చేసిన వారిలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్ కుమార్ తో పాటు మరికొందరు ఎన్టీఎఫ్ నేతలు ఉన్నారు.




Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405